క్లుప్తంగా

చుడా చైర్మన్ పదవీకాలం పొడిగింపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్మన్ సి.పురుషోత్తం రెడ్డి పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పదవీకాలం గత నెల 2వ తేదీన పూర్తి అయిన విషయం తెలిసిందే. ఈమేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బుధవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ నగదును 5 రోజుల లోపు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య రక్ష ..జగనన్న సురక్ష

చిత్తూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కొందరికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ జయరాం, సర్పంచ్ మునిరత్నం, నాయకులు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చిత్తూరులో సామాజిక బస్సు యాత్ర


గుడిపాల: మాట్లాడుతున్న సర్పంచ్ రజనీకాంత్

గుడిపాల: చిత్తూరులో నవంబర్ 2న నిర్వహించనున్న సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని కుప్పిగానిపల్లె సర్పంచ్ మధుసూదన్‌రాయల్, వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులతో, వసంతాపురం సచివాలయంలో వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును, ప్రభుత్వం అందించిన సాయం, హామీలన్నింటినీ నెరవేర్చడంపై ప్రజలకు వివరించేందుకు యాత్ర కొనసాగుతుందన్నారు. నాయకులు చెంగల్రాయులు, వెంకట్రమణ, ప్రసాద్, రాజా, శంకర్, ప్రభాకర్, లోకనాథం, కోదండ, మైకెల్ పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి


తహసీల్దార్ మురళి

చిత్తూరు కలెక్టరేట్ : రామకుప్పం తహసీల్దార్ మురళికి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ జీవో 510 జారీచేశారు. 2023–24 ప్యానల్ సంవత్సరానికి గాను ఉద్యోగోన్నతి కల్పించినట్లు జీవోలో పేర్కొన్నారు. త్వరలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

రెగ్యులరైజేషన్ జాబితాలు విడుదల చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ జాబితాలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు గంటామోహన్ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు మంగళవారం డీఈవో విజయేంద్ర రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబితాలు విడుదల చేయకపోవడం వల్ల ఉద్యోగోన్నతులు, బదిలీల్లో అవకతవకలు చోటు చేసుకుంటాయని చెప్పారు. నవంబర్ నెల లోపు జాబితాలు విడుదల చేయాలని కోరారు. ఆ సంఘ నాయకులు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



యాదమరి: కొనాపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం ప్రింటర్‌ను వితరణగా అందింది. మండలంలోని గొందివాళ్లపూరు హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీ అయిన రవీంద్రరెడ్డి, ఆయన మిత్రులు కలసి రూ.16 వేలు విలువ గల ప్రింటర్‌ను విరాళంగా అందించారు. ఎంఈఓ రుక్మిణీ, ఎంఈఓ 2 ప్రసాద్ చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు.

హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ సుమన్

యాదమరి: గ్రామీణ ప్రజలు హక్కులను తెలుసుకోవాలని తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్, ఎస్‌ఐ సుమన్ సూచించారు. మంగళవారం మానవ హక్కులపై మండలంలోని ఎంవీవై కాలనీలోని గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు రెవెన్యూ సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీడీఓ, ఎలాంటి గొడవలు ఉన్న, ఎవరైనా బెదిరింపులకు గురి చేసిన పోలీసులను సంప్రదించాలని తెలిపారు. దళిత సంఘం నాయకులు మురుగేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,మేయర్ అముద

చిత్తూరు అర్బన్: ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం చిత్తూరు నగరంలోని 46వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ ఎస్.అముద, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప లక్ష్యంతో స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడారు. వైద్యులు బాగా చూస్తున్నారా? మందులు అందాయా అని ఆరా తీశారు. అనంతరం వైద్యులు, అధికారులతో మాట్లాడారు. నాణ్యమైన వైద్య సేవలలు అందించాలని తెలిపారు. వైద్యం చేయించుకునన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, కార్పొరేటర్లు రెడ్డప్ప, జ్ఞాన జగదీష్, కో ఆప్షన్ సభ్యులు కిరణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం


బంగారుపాళెంలో మానవహారంగా ఏర్పడి సమైక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విద్యాసంస్థల్లో మంగళవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ సమైక్యతా దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమాలు జరిపారు. పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ సేవలను వివరించారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ దేశం కోసం పనిచేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. గిరింపేట వరకు సమైక్యతా నడక కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భానుప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ తులసి బాబు వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలోని గాంధీ విగ్రహం వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. నాయకులు చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పటేల్

గుడిపాల: విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన తొలి ఉపప్రధానిసర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శ ప్రాయుడని, దేశరక్షణ, సమగ్రతకు ఆయనెంతో కృషిచేశారని జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిపాలలో జాతీయ ఏక్తా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి సెల్యూట్ చేశారు. సమగ్ర భారతదేశానికి పటేల్ చేసిన కృషిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎస్ఆర్ కళాశాల, బొమ్మసముద్రం జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి, ప్రిన్సిపాళ్లు లోకేష్, శరత్‌చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రజనీకాంత్, సాయికృష్ణ, గుండుసాయి పాల్గొన్నారు.

పూతలపట్టు: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరవలేనివని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు పటేల్ చేసిన కృషి అమోఘమని కొనియాడారు. అనంతరం జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, ఏఓ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టితో ఏకత్వం స్ఫూర్తిని నింపారన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: భారతదేశ ఐక్యతకు పాటుపడిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, బంగారుపాళెం పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చిన విద్యార్థులు నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ మొదటి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా దేశానికి అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంఈఓలు నాగేశ్వర్ రావు, రమేష్‌బాబు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాధాకృష్ణ, సర్పంచ్ ఉమాదేవి, ఉపసర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఉష పాల్గొన్నారు.


చిత్తూరు: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


గుడిపాలలో ర్యాలీ


పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


పూతలపట్టు: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది


యాదమరి: కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో..


బంగారుపాళెం: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా


జగనన్న ఆరోగ్య కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. బంగారుపాళెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థానిక సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో పాల్గొన్న 403 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. అనంతరం మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ ఉష, సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జాకీర్ అహ్మద్

బంగారుపాళెం: పాఠశాలల్లోని ప్రయోగశాలలను(ల్యాబ్) వినియోగించుకుని విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని విద్యాశాఖ టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యుడు మహ్మద్ జాకీర్ అహ్మద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం కమిటీ బృందం సందర్శించింది. ల్యాబ్‌ను పరిశీలించి, పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంధ విద్యార్థుల కోసం తయారు చేసిన వాకింగ్ స్టిక్, షూస్‌ను పరిశీలించి అభినందించారు.ఎంఈఓ నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం రాధాకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన

తవణంపల్లె: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని టి.పుత్తూరు, దిగువమోదల పల్లె, చిగరాకులపల్లె గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన జగనన్న పాల వెల్లువపై రైతులకు అవగాహన కోసం గ్రామ సభలు నిర్వహించారు. వెటర్నరీ అధికారి లావణ్య, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, సర్పంచ్‌లు రవిచంద్రా రెడ్డి, చలపతి, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

పూతలపట్టు: మండలంలో యం.బండపల్లె గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాటుగారి భాస్కర్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో ఇందిరాగాంధీ చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. నాయకులు ప్రభాకర్, పరదేశి, విక్టోరియా, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ డ్రైవర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న లారీ ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లు

యాదమరి: మండల కేంద్రమైన యాదమరిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో టర్మల్ మేనేజర్‌తో చిన్న వివాదం కారణంగా డ్రైవర్లు, క్లీనర్లు ట్యాంకర్లను లోడింగ్‌కు వెళ్లకుండా ఆపేసి నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. స్థానిక ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో నిత్యం వందల సంఖ్యలో లారీ ట్యాంకర్ల ద్వారా పలు జిల్లాలకు పెట్రోల్, డీజిల్‌ను తరలిస్తుంటారు. ట్యాంకర్లను ఐఓసీఎల్ ముందు డ్రైవర్లు నిత్యం పార్కింగ్ చేస్తుంటారు. అలాగే ఐఓసీఎల్ పార్కింగ్‌లో కూడా నిలుపుతారు. మంగళవారం చిత్తూరు టెర్మల్ మేనేజర్(సీటీఎం) సర్దార్‌సింగ్ ఉదయం లారీ ట్యాంకర్లు లోడింగ్ ఉన్నవాటిని మాత్రమే లోపల పార్కింగ్ చేయాలని, మిగిలినవని తీసేయాలని ఆదేశాలు జారీ చేశారు. సీటీఎం నోటికొచ్చినట్లు మాట్లాడడంపై ఆగ్రహించిన డ్రైవర్లు, క్లీనర్లు లోడింగ్‌కు వెళ్లకుండా, ఎక్కడి ట్యాంకర్లు అక్కడే ఆపేశారు. దీంతో సీటీఎం సిబ్బందితో కలిసి డ్రైవర్లు, క్లీనర్లతో చర్చించారు. లారీ ట్యాంకర్లను లోపల పార్కింగ్ చేసుకోవచ్చని డ్రైవర్లు, క్లీనర్‌లకు చెప్పడంతో వారు శాంతించారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: కార్మికులకు అండగా ఏఐటీయూసీ నిలుస్తోందని జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక హైరోడ్డులో సమావేశం నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1920లో ఏఐటీయూసీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రామికుల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండాలతో నిత్యం పోరాటాలు చేస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కోడ్‌లుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగుగా కుదించి అన్యాయం చేసిందని తెలిపారు. నాయకులు ప్రేమ, రమాదేవి, కృష్ణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ఏఐటీయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు.

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన


పుత్రమద్ది ఆర్బీకేలో జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఐరాల: మండలంలో పూర్తయిన ఈ–క్రాప్ నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం ప్రదర్శనకు ఉంచామని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 9వేల ఎకరాల పంట సాగుకు ఈ–క్రాప్ పూర్తయినట్లు ఆమె చెప్పారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ–క్రాప్ ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా పుత్రమద్దిలో ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచామన్నారు. రైతులు ఒకసారి పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్

పూతలపట్టు: సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఎగువపాలకూరు హరిజనవాడలోని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్నజాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలకూరు జీవరత్నంరెడ్డి, ఎంపీడీఓ గౌరి, రైటర్ భాస్కర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టండి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను చెక్ చేశారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే స్కూల్‌లో ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి రాసుకుంటున్న నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేసి వారి సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించండి

పూతలపట్టు: మండలంలో డీకేటి భూములు కోల్పోయిన ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన పేద రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని రిటైర్డ్ జడ్జి గుర్రప్ప మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. నాలుగేళ్లుగా నష్టపరిహారం కోసం 30 మంది బాధితులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. మండలంలోని పోటుకనుమ రెవెన్యూ పరిధిలో ఓ ప్రైవేటు కంపెనీ అవసరాల కోసం 30 మంది రైతుల నుంచి 44 ఎకరాల డీకేటీ భూములను అధికారులు సేకరిస్తున్నారని, ఈ మేరకు బాధితులు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారన్నారు. అయితే అధికారులు సానుకూలంగా స్పందిస్తూ పలుమార్లు ఆదేశాలు జారీ చేశారని, కానీ పూతలపట్టు రెవెన్యూ అధికారులు మాత్రం వాటిని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. రెండు నెలలుగా నష్టపరిహారానికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసి సమగ్ర సమాచారం పంపాలని చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పూతలపట్టు తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చినా వాటిని ఖాతరు చేయడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో రైతులకు న్యాయం చేయాలని కోరారు.